క్లుప్తంగా

చెక్కులు పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో బద్దం మధుసదూన్‌రెడ్డికి రూ.36 వేలు, జిల్లేపల్లి గోవర్ధనాచారికి రూ.25 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మొండికుంట సర్పంచ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గొర్రె ముచ్చు వెంకటరమణ, పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు అన్యాయం

చర్ల: రాష్ట్రంలోని ఏకలవ్య పాఠశాలల్లో చేరే విషయంలో గిరిజన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని సుబ్బంపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ విధానం ద్వారా అడ్మిషన్లు ఇస్తుండడంతో మారుమూల ప్రాంతాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులు పోటీ పరిక్షల్లో మైదాన ప్రాంత విద్యార్థులతో పోటీ పడలేకపోతున్నారని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థుల వెనుకబాటుతనాన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులకు ఏకలవ్య పాఠశాలలో సీట్ల కేటాయింపులో సడలింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు శ్యామల బాబూరావు, కనితి నాగేశ్వరావు, పాల్గొన్నారు.

పోడు పట్టాలు ఇప్పించండి

దమ్మపేట: అశ్వారావుపేట మండలం, ఊట్లపల్లి పంచాయతీ, వాగొడ్డుగూడెం గ్రామస్తులు పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ.. స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం దమ్మపేట మండలంలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యేను, ఆయన నివాసంలో ఊట్లపల్లి సర్పంచ్ సాధు జ్యోత్స్న భాయ్, వాగొడ్డుగూడెం గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామస్తులు మాట్లాడుతూ.. సాగులో ఉన్న తమ పోడు భూములకు సర్వే చేయించి, పోడు పట్టాలు ఇప్పించాలని కోరారు. వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నూతన చైర్మన్ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీతారామనగర్ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కురిచేటి శ్రీనివాసరావుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, పుల్లారావు, కృష్ణయ్య, రాంబాబు, నరేష్, శారద, రామచంద్రమూర్తి, అర్చకులు నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

బూర్గంపాడు: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి షేక్ అన్వర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మసీదులను ముస్లిం నాయకులతో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ పార్టీకి ముస్లింలు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు యూసుఫ్,సాబీర్,ఖాదర్, గుల్ మహ్మద్, సుభాని, ఖాదర్ పాల్గొన్నారు.

బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గంలో పూర్తిస్థాయి బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి పార్టీ నాయకులకు సూచించారు. భద్రాచలం పట్టణంలోని పల్లె ప్రకృతి వనంలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆదివారం 'టిఫిన్ బాక్స్ టై టాక్'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి కార్యకర్తా పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు. ఎర్రం రాజు బెహరా, నిడదవోలు నాగబాబు, బోడా సత్యనారాయణ, క్రాంతి కుమార్, రామ్మోహన్‌రావు, శ్రీనివాసచారి, నరసింహారావు పాల్గొన్నారు.

అమ్మవారికి వితరణ

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని నడికుడిలో ఉన్న మహంకాళి చాముండేశ్వరి అమ్మవారి దేవాలయానికి భద్రాచలం పట్టణానికి చెందిన స్థపతి వెంకటరమణమూర్తి కుమార్తె అల్లుడు అంకాల గోవిందరావు–శారధ దంపతులు ఆదివారం ఇత్తడి కుందులను అందజేశారు. ఆదివారం అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న వారు దీపారాధనకు అవసరమైన కుందులను ఆలయ అర్చకులకు అందజేశారు. అనంతరం ఆలయంలో అర్చకులు ఆరిందల యశ్వంత్ శర్మ, హేమంత్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పారిశుద్ధ్యంపై సమ్మె ఎఫెక్ట్

- కంపు కొడుతున్న ప్రధాన రహదారులు
- పేరుకుపోయిన చెత్త
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం



మణుగూరురూరల్: చెట్ల కొమ్మలతో అధ్వానంగా దర్శనమిస్తున్న అంతర్గత వీధి



భద్రాచలంటౌన్: పట్టణంలోని ఓ కాలనీలో రోడ్డు పక్కన చెత్త



బూర్గంపాడు: సారపాక ప్రగతి స్కూల్ ప్రాంతంలో రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తకుప్ప

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం పట్టణంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెతో పారిశుద్ధ్యం పడకేసింది. నిత్యం భక్తులు, సందర్శకుల సందడితో రద్దీగా ఉండే పుణ్యక్షేత్రం రోడ్లపై ఎక్కడ చూసిన కుప్పలు కుప్పలుగా చెత్త దర్శనమిస్తుంది. దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చే భక్తులతో పాటు పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కంపుకొడుతున్న కాలనీ రోడ్లు..

వానా కాలం కావడంతో పట్టణ వాసులు ప్రతి రోజూ ఉదయం నుంచి ఇంట్లో లభ్యయే చెత్తను ఉంచుకోరు. కార్మికుల సమ్మెతో చెత్త సేకరణ వాహనం రాకపోవడంతో ఒకటి, రెండు రోజులు చూశారు. ఒక్కరోజు గ్రామ పంచాయతీ చెత్త సేకరణ వాహనం రాకపోతే ఇబ్బందులు పడే పట్టణ వాసులు.. సమ్మె మూలంగా పది రోజులుగా చెత్తను ఇంట్లో ఉంచుకోలేక నిర్మాణుష్యంగా ఉండే చోట రోడ్ల పైనే వేస్తున్నారు. దీంతో రోజుల తరబడి నిలువ ఉన్న చెత్తపై ఈగలు వాలి అవి ఇళ్లలో సంచరిస్తున్నాయి. కుక్కలు, పందులు చెత్తను రోడ్ల నిండా ఛిద్రం చేస్తుండడంతో పట్టణంలోని కాలనీల్లో ఈ పరిస్థితి దారుణంగా ఉంది. శివారు పట్టణ వాసులు ఇటు కూనవరం రోడ్డు చివర, అటు రాజుపేట కాలనీ చివర ఇళ్లలోని తడి, పొడి చెత్తను పడి వేయడంతో ఆ ప్రాంతాలు డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. ఈ పరిస్థితులు మూలంగా వానా కాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని కాలనీల్లోని వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామాలయానికీ తప్పని తిప్పలు

భద్రాద్రి రామాలయం పరిసరాల్లో కూడా చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన కుండీలు నిండిపోయాయి. దీంతో రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. పుణ్యస్నానాలు ఆచరించే గోదావరి నదితో పాటు కరకట్టపై ఇదే దుస్థితి నెలకొంది. దీంతో రామయ్య దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ అధికారులు స్పందించి పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాల్సిందిగా భక్తులు కోరుతున్నారు.

బూర్గంపాడు: గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెతో బూర్గంపాడు మండలంలోని గ్రామాల్లోనూ పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. పదిరోజుల క్రితం వరకు శుభ్రంగా ఉన్న వీధులు ఇప్పుడు మురికికూపాలుగా మారాయి. వీధులలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. చెత్తకుప్పల వద్ద పందులు సంచరిస్తు మరింత ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అపరిశుభ్ర పరిస్థితులతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గత నాలుగైదు రోజులుగా ప్రభుత్వం తాత్కాలిక కార్మికులతో పనులు జరిపించే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య చర్యలు జరగటం లేదు.వ్యాపార సముదాయాలు, హోటళ్లు, చిరువ్యాపారాలు, పండ్లు, కూరగాయల దుకాణాల వద్ద చెత్త కుప్పలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి.

మణుగూరు పట్టణంలో..

మణుగూరురూరల్: మణుగూరు మండల వ్యాప్తంగానూ పారిశుద్ధ్యం పడకేసింది. డ్రెయినేజీ వ్యవస్థం అస్తవ్యస్తంగా దర్శనమిస్తోంది.

పంచాయతీ కార్మికుల సమ్మెతో సైడ్ డ్రెయిన్లలో మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల పాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తూ..పేరుకుపోయిన చెత్తకుప్పలను చెల్లాచెదురు చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల చెత్తాచెదారం వర్షానికి తడిసి మరింత కంపు కొడుతూ ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. దీంతో పట్టణ, గ్రామాల ప్రజలు పేరుకుపోయిన చెత్తాచెదారంతో, మురుగునీటి కాల్వల దుర్వాసనలతో అనారోగ్యాలకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే, సమ్మెతోపాటు అధికారుల నిర్లక్ష్యమూ పారిశుద్ధ్య లోపానికి కారణంగా కనిపిస్తోంది.

సమస్యను పరిష్కరించాలి



పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు జరపాలి. వర్షకాలం కావడంతో పట్టణంలో పారిశుద్ధ్య పనులు లోపించాయి. ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని కార్మికులు సమ్మెను విరమించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– ఆకోజు సునీల్, సీపీఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి

కార్మికులు అడ్డుపడుతున్నారు..



భద్రాచలం పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేయించేందుకు సుమారు 100 మంది తాత్కాలిక సిబ్బంది తీసుకొచ్చాం. వారితో పనులు చేయిస్తుంటే పంచాయతీ కార్మికులు అడ్డుపడుతున్నారు. కార్యాలయం నుంచి ట్రాక్టర్లు సైతం బయటకు రానివ్వడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పారిశుద్ధ్య పనులు చేయిస్తాం.

– వెంకటేశ్వర్లు, భద్రాచలం పంచాయతీ ఈఓ

అధ్వానంగా రహదారి

అశ్వాపురం: మండల కేంద్రంలో అశ్వాపురం– గొందిగూడెం రహదారి ఆదివారం కురిసిన వర్షానికి బురదమయమై అధ్వానంగా తయారైంది. రహదారి నీటి కుంటలను తలపిస్తోంది. వృద్ధులు, పిల్లలు, మహిళలు రహదారిపై అడుగు తీసి అడుగు పెట్టలేకపోతున్నారు. ఈ సమస్యపై స్థానికులు ఎంతో కాలంగా విన్నవిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆందోళన వ్యక్తం చేసిన స్థానికులు.. చిత్తడిగా ఉన్న ఆ రహదారిపై నాట్లు వేసి తమ నిరసన తెలిపారు. ఇప్పటికైనా రహదారిని నిర్మించాలని కోరారు.



అశ్వాపురం-గొందిగూడెం రహదారిపై నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న స్థానికులు

ఆలయ అభివృద్ధికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యుడు

భద్రాచలంటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయ అభివృద్ధికి ఆదివారం అసిస్టెంట్ ప్రొఫెసర్ పారెల్లి శ్రీనివాస్–సునీత దంపతులు విరాళం అందించారు. స్వామివారి స్వర్ణ సింహాసన నిర్మాణానికి రూ.11,116 వేలు ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ కమిటీ వారు దాతలను శాలువతో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో కుంచాల రమేష్‌బాబు, తేజ స్వరూప్, భవ్య శ్రీ, గౌతమ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

24గంటల విద్యుత్ ఉత్తిమాటే..

బూర్గంపాడు: వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ఉత్తిమాటేనని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బూర్గంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాంకేతిక కారణాలను సాకుగా చూపి రైతులకు ఐదారు గంటల కరెంట్ మాత్రమే ఇస్తోందన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ హయాంతో ఈ పరిస్థితి లేదని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆందోళన కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, ధనసరి సూర్య, కణితి కృష్ణ, బర్ల నాగమణి, పోతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, మందా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు అందజేత

అశ్వారావుపేటరూరల్: సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను ఆదివారం లబ్ధిదారులకు అందించారు. అశ్వారావుపేట రైతు వేదికలో గ్రామీణ వ్యవసాయ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, ఆ సంఘం జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ రామకృష్ణ రాజు చేతుల మీదుగా 50 శాతం సబ్సిడీపై 23 మంది గిరిజన రైతులకు డబుల్ బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. త్వరలో తైవాన్ స్ప్రేయర్లను కుడా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ శివకుమార్, మాజీ ఎంపీటీసీ కె.వెంకట రమణ, సుబ్బారావు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

మణుగూరురూరల్: మణుగూరులోని పాత ఆంధ్రాబ్యాంక్ ఏరియాలో మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు ఆదేశానుసారం సీఐ ముత్యం రమేష్ ఆధ్వర్యంలో ఎస్సై పురుషోత్తం ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలను, కార్లను నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు వాహనాలకు సంబంధించిత పత్రాలను, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా, నిబంధనలు అతిక్రమించి వాహనాలు పడుపుతున్న వాహనదారులకు ఈ–చలానా విధించారు.

చీపురు పట్టిన సర్పంచ్

చర్ల: చర్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చీపురు పట్టి మార్కెట్ సముదాయాన్ని శుభ్రం చేశారు. గత 11 రోజులుగా పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేస్తుండడంతో మార్కెట్ సముదాయం చెత్తతో పేరుకుపోయింది. కాగా, ఆదివారం చర్లలో వారపు సంత జరుగాల్సి ఉంది. సంతకు వచ్చే వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు ఆదివారం ఉదయం మార్కెట్ సముదాయంలో ఊడ్చి చెత్తను ఎత్తారు. సోమవారం నుంచి పంచాయతీ పాలకవర్గ సభ్యులందరితో కలిసి పారిశుద్ధ్య సమస్యాత్మక కాలనీల్లో చెత్త తొలగిస్తామని చెప్పారు.

ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో సోడె వెంకటేశ్వర్లు మనవరాలు అంజలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆదివారం దశదిన కర్మలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై మృతురాలి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు పర్వత నరేష్, శ్రీనివాసరెడ్డి, రాజేష్, శ్రీను, సురేందర్‌రెడ్డి, పడిదం శ్రీను, నెహ్రూ, మహేష్, వెంకన్న, సీతరాములు పాల్గొన్నారు.

వైభవంగా ఆషాఢ బోనాలు

ఆషాఢ బోనాల వేడుకలను ఆదివారం అంగరంగవైభవంగా జరిపారు. డీజే సౌండ్లు, డప్పులు, శివసత్తులు, కోలాటంతో మహిళలు గ్రామంలో ఊరేగింపుగా తరలారు. నెత్తిన బోనమెత్తి ఆయా ప్రాంతాల్లోన్ని ముత్యాలమ్మ, అంకమ్మ తల్లి ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: బోనాలతో అమ్మవారి ఆలయానికి వస్తున్న గ్రామ మహిళలు



అన్నపురెడ్డిపల్లి: కోలాటం ఆడుతున్న మహిళలు



చండ్రుగొండ: తిప్పనపల్లిలో బోనమెత్తిన మహిళలు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఆదివారం ఆయన మణుగూరు మున్సిపాలిటీ పరిధి విఠల్‌రావునగర్ గ్రామంలో కాలినడకన విస్తృతంగా పర్యటించారు. ప్రతీ గడపను సందర్శిస్తూ.. ప్రజలను పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తూ.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పినపాక నియోజకవర్గంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి నవీన్, నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ఎడ్ల శ్రీనివాస్, తాతా రమణ, ముద్దంగుల కృష్ణ, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

దమ్మపేట: భూ కబ్జాకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గాయత్రి నగర్‌లో తాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులతో కలసి పర్యటించారు. కొందరు వ్యక్తులు, వేసవి కాలంలో స్థానికంగా గల ప్రభుత్వ భూమిలోని డ్రెయినేజీను మట్టితో పూడ్చి భూ కబ్జాకు పాల్పడటం వల్ల వర్షాకాలంలో నీరు నిలిచిపోయి అనేక ఇబ్బందులు పడాల్సిస్తోందని స్థానికులు తాటి వెంకటేశ్వర్లుకు తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన తాటి మాట్లాడుతూ.. అధికార పార్టీకు చెందిన నాయకుడు గాయత్రి నగర్‌లోని డ్రెయినేజీను పూడ్చి, ప్రభుత్వ భూమిని కబ్జా చేయడం శోచనీయమని అన్నారు. అతనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అత్తులూరి వెంకటరామారావు, పానుగంటి సత్యం, పసుమర్తి చిన్నబాబు, మురహరి రాంబాబు, స్థానికులు గడ్డిపాటి సత్యం, వెంకట్రావు పాల్గొన్నారు.

వైభవంగా మరిడమ్మ జాతర

చర్ల: దుమ్ముగూడెం మడలంలో ఆదివారం మరిడమ్మ జాతర వైభవంగా సాగింది. మండలంలోని లక్ష్మీనగరంలో మరిడమ్మ ఆలయం వద్ద అమ్మవారి ప్రతిరూపాలైన దేవరబాలలు పూనకాలతో అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మంగళస్నానాలు ఆచరించారు. సాయత్రం అమ్మవారి ప్రతిరూపం గరికలో దీపాలు వెలిగించి ప్రధాన వీదుల్లో ఊరేగింపుగా ములకపాడు సెంటర్‌లో ఉన్న మరిడమ్మ వృక్షం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రహదారిపై అడ్డంగా పడిన చెట్టు



అశ్వారావుపేటరూరల్: రహదారిపై అడ్డంగా పడిపోయిన చెట్టు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం–కొత్త మామిళ్లవారిగూడేనికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఆదివారం తెల్లవారుజామున వచ్చిన గాలి దుమారంతో ఓ చెట్టు విరిగి పడింది. ప్రధాన రహదారిపై చెట్టు అడ్డంగా పడిపోవడంతో అటువైపు రాకపోకలకు అంతరాయం కలిగింది. దాంతో కొంతమంది స్థానికులు రహదారిపై పడిపోయిన చెట్టును తొలగించారు.

వరి రైతులకు నష్టం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గుమ్మడవల్లి సమీపంలో కొంత మంది రైతులకు చెందిన వరి నారు మళ్లను ఆదివారం పశువులు మేయడంతో నష్టపోయారు. గ్రామానికి చెందిన గోదా వీరబాబు, వెంకటేశ్వర్లుతోపాటు మరో రైతుకు చెందిన వరి నారుమళ్లను పశువులు మేసి, కాళ్లతో తొక్కేశాయి. దాంతో వరి నారు పూర్తిగా దెబ్బతిని, ఆయా రైతులు నష్ట పోయారు. కాగా వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో పశువులను కాపు పట్టాలని, చాటింపు వేసినప్పటికీ కొంతమంది పశువుల బాధ్యులు వాటిని వదిలేస్తున్నారని రైతులు వాపోతున్నారు. పశువులు పొలాల్లోకి రాకుండా గ్రామ పంచాయతీ బాధ్యులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో కుంపటి



సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్న పేటేటి నర్సింహారావు



జెడ్పీటీసీ నాగమణితో కలిసి సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్న తాండ్ర ప్రభాకర్‌రావు


ములకలపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల కమిటీలో కన్ఫ్యూజన్ నెలకొంది, మండల అధ్యక్షుడిగా పేటేటి నర్సింహారావు, తాండ్ర ప్రభాకర్‌రావు ఎవరికివారే తామే అంటూ ప్రకటించుకుంటున్న నేపథ్యంతో కార్యకర్తల్లో గందరగోళం ఏర్పడుతుతోంది. వీరు ఇరురివురూ అధ్యక్ష హోదా కోసం పోటాపోటీగా కార్యక్రమాలు చేస్తున్నారు.

గతంతో మండలంలో పర్యటించిన డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య నాడు మాట్లాడుతూ.. నూతన కమిటీకి చెందిన తాండ్ర ప్రభాకర్‌రావు మాత్రమే మండల అధ్యక్షుడని, పాత కమిటీలన్నీ రద్దయ్యాయని తేటతెల్లం అయ్యాయని చెప్పారు. దీంతో గందరగోళానికి తెరపడింది అనుకుంటున్న తరుణంలో.. ఆ వెంటనే పేటేటి నర్సింహారావు తానే మండల అధ్యక్షుడినని మండలకేంద్రంలో అశ్వారావుపేట నియోజవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. తమ కమిటీలు ఇంకా రద్దు కాలేదని, నూతన కమిటీలు ప్రతిపాదనలకే పరిమితం అయ్యామని, వాటికి అధిష్టానం అనుమతించాల్సి ఉందన్నారు. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. ఈ తరుణంలో స్థానిక జెడ్పీటీసీ సున్నం నాగమణితో కలిసి అధ్యక్షుడిగా తాండ్ర ప్రభాకర్‌రావు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరోపక్క మండల అధ్యక్షుడిగా పేటేటి నర్సింహారావు సైతం అంతేపోటీగా పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. డీసీసీ అధ్యక్షుడి మాటను తూలనాడి తానే అధ్యక్షుడినంటూ పేటేటి నర్సింహారావు సోషల్ మీడియాలో పేర్కొనడం, పార్టీ కార్యక్రమాలు చేపతున్నా అధిష్టానం స్పందించక పోవడం గమనార్హం.

శుక్రవారం సైతం గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెకు ఇరువురుగా వేర్వేరుగా మద్దతు ప్రకటించారు. ఎవరికివారే యమునాతీరే అన్నచందంగా ఒకేరోజు వర్గాలుగా ఏర్పడి సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఎన్నికల తరుణం ముంచుకొస్తున్న వేళ గ్రూపు రాజకీయాలతో ఏముప్పు వాటిల్లుతుందోనని కార్యకర్తలు తీవ్రమనోవేదనకు గురౌతున్నారు. అధ్యక్షుడు ఎవరైనా పార్టీ పటిష్టతే తమ లక్ష్యమని అంటున్నారు. ప్రస్తుతం ములకలపల్లికి వీరిలో అధ్యక్షస్థానం ఎవరిదనే అంశంలో అధిష్టానం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరుకుంది. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందని ఈ సందర్భంగా కార్మికులు అసహనం వ్యక్తం చేశారు. పలు చోట్ల వినూత్న రీతుల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు పెంచి, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. పలువురు నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



చర్ల: మోకాళ్లపై నడుస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు



మణుగూరురూరల్: అర్ధనగ్నంతో నిరసన తెలియజేస్తున్న పంచాయతీ కార్మికులు



అశ్వారావుపేటరూరల్: మానవహారం నిర్వహిస్తున్న జీపీ కార్మికులు